క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయోత్సవ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనేక దశాబ్దాలుగా కృషి చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డిలు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లాలోని మాచర్ల పట్టణంలోని వీవీఎస్ గార్డెన్‌లో పల్నాడు జిల్లా యూనియన్ విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు, రమణారెడ్డిలు మాట్లాడుతూ ఎన్ఎంయూను స్థాపించిన స్వర్గీయ రామ్మోహనరావు సేవలు సంస్థలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రంలో 51 వేల మంది ఆర్టీసీలో పనిచేస్తుండగా అందులో 23 వేల మంది సభ్యత్వంతో రాష్ట్ర చరిత్రలో గుర్తింపు పొందిన సంఘం ఎన్ఎంయూ అని చెప్పారు. ముందుగా స్వర్గీయ రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్.రాజేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పూర్ణచంద్రరావు, పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు డి.సుబ్బారావు, జోనల్ నాయకులు ఎంఎస్ నారాయణ, జోనల్ కార్యదర్శి ఎస్.మురహరిరావు(మురారి)లు మాట్లాడారు. సభకు ఆర్టీసీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు భారీ స్థాయిలో హాజరై ఎన్ఎంయూకు జేజేలు పలికారు.

నిత్యావసరాలు అందజేత




మాచవరం: పేదలు, అనాథలు, వికలాంగులకు సహాయ సహకారాలు అందించేందుకు ఫొటోగ్రాఫర్ల యూనియన్ తన వంతు సాయం అందిస్తుందని యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ అన్నారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో అమ్మ వికలాంగుల, వృద్ధాశ్రమం, మదర్ థెరిసా వికలాంగుల ఆశ్రమాలకు మండల ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. ఆశ్రమాల్లో పలువుర్ని చేరదీసి సేవలు అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బుడె, సభ్యులు డీకే సతీష్, రవి, బాజీ, వీరబాబు, హరిబాబు, ఆశ్రమాల నిర్వాహకులు సైదాబి, దరియాబి, వలి , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి స్వల్ప గాయాలు

మాచవరం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని తురకపాలెం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యువకుడు వినాయకుని విగ్రహం నిమజ్జనం చేసేందుకు వెళ్తుండగా తురకపాలెం గ్రామ సమీపంలోని వాగు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఆరోగ్య మిత్ర మహిళా అధ్యక్షురాలిగా మహాలక్ష్మి



పిడుగురాళ్ల: ఆరోగ్యశ్రీ పథకం విభాగం పల్నాడు జిల్లా మిత్ర మహిళా అధ్యక్షురాలిగా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఏలూరి మహాలక్ష్మి ఎన్నికయ్యారు. నర్సరావుపేటలో ఆరోగ్యశ్రీ పథకం విభాగంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలు నూతనంగా అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఏలూరి మహాలక్ష్మి మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షులు మాచర్ల బుజ్జి, ఎన్నికల అధికారి కాకాని అప్పారావు, ప్రెసిడెంట్ సాయిబాబులు మహాలక్ష్మికి అభినందనలు తెలియజేశారు.

బావిలో పడి బాలుడి మృతి

ముప్పాళ్ళ: మండలంలోని మాదల గ్రామానికి చెంది ఇస్తల గణేష్(14) అనే బాలుడు పొలానికి వెళ్లి బావిలో శవమై కనిపించాడు. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసరావు, లావణ్య కుమారుడు గణేష్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల ముగిశాక గేదెలు తోలుకొని పొలానికి వెళ్లిన తన తల్లి వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి నేరుగా పొలానికి వెళ్లాడు. చిరుజల్లులు కురుస్తుండటంతో పొలంలో ఉన్న గణేష్ తల్లి లావణ్య గేదెలను తోలుకొని ఇంటికి వచ్చింది. చీకటి పడ్డాక కూడా గణేష్ ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు ఆరా తీయగా పొలానికి వెళుతున్నాని చెప్పినట్లుగా చుట్టుపక్కల వారు చెప్పారు. ఆ మేరకు పరిసర ప్రాంతాలతో పాటుగా బంధువుల ఇళ్లలోను వెతుకులాట చేపట్టిన ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు ముప్పాళ్ళ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అనుమానం వచ్చిన కాలనీ వాసులు పొలానికి సమీపంలో ఉన్న బావిలోని నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడగా లోపల బురదలో కూరుకుపోయి గణేష్ మృతదేహం కనపడింది. శరీరమంతా ఉబ్బి పోయి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజల కోసమే ప్రభుత్వం పనిచేస్తుంది

- ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి
- పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని, మంచి మనస్సున్న మా రాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొందుగలలో రూ.25లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.20లక్షలతో నిర్మించిన ఈద్గాను ఆదివారం ఆయన ప్రారంభించారు. రూ.27లక్షలతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 210 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చదువుకోవటానికి మంచి స్కూల్స్, అనారోగ్యం పాలైతే నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు హాస్పిటల్స్‌ను ప్రభుత్వం నిర్మించిందని, ఈ ప్రభుత్వం ద్వారా ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పటంలో సందేహం లేదని అన్నారు. నవరత్నాల ద్వారా పొందుగల గ్రామంలో ప్రజలకు రూ.7 కోట్ల మేర లబ్ధి జరిగిందని, రూ.1.30 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించామని, టీడీపీ ప్రభుత్వంలో 45 పింఛన్లు ఇస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 110 పింఛన్లు ఇచ్చామని, గ్రామంలో 40శాతం మందికి ఇంటి స్థలాలు ఇచ్చామని ఎమ్మెల్యే చెప్పారు. ఒక్కొక్కరికి ఇచ్చిన స్థలం విలువ ఇప్పుడు రూ.2లక్షలు ఉందని ఐదేళ్లలో రూ.5లక్షల వరకు ఉంటుందని, రానున్న ఆరు నెలల కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిని మంజూరు చేస్తామని అన్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ సేవలను అవకతవకలు, అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ఇంటి వద్దే అందిస్తున్నామని చెప్పారు.

ఆరు నెలల్లో ఇంటింటికీ కృష్ణా జలాలు..

ఆరు నెలల్లో పొందుగలలోని ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు తీసుకొస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ పనులకు రూ.45లక్షల నిధులు మంజూరు చేస్తున్నామని, పైపులైన్ల ద్వారా నేరుగా కృష్ణా జలాలు ఇంటింటికీ అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఎత్తిపోతల పథకం తీసుకువచ్చి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని, ప్రతి రైతు సంతోషం కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలంతా నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు.

ముస్లింలను గుండెలో పెట్టుకుని చూసుకుంటున్నాం..

పొందుగలలో అత్యధికంగా ముస్లింలు ఉన్నారని వారు ఎప్పుడు మా గుండెలో ఉంటారని ఎమ్మెల్యే కాసు అన్నారు. ముస్లిం మైనార్టీలు తనను కలసి ఈద్గా నిర్మించాలని కోరారని ఆ మేరకు మొత్తం రూ.50 లక్షలతో ఈద్గా స్థలం బాగు చేసి నిర్మించామని, వారంతా ఒకే చోట నమాజ్ చేసుకునేందుకు ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. రాజకీయంగా, ఆర్థికంగా ముస్లిం మైనార్టీలను అభివృద్ధి చేసి అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, సర్పంచ్ తండా బుడేసా, ఉప సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, వైస్ ఎంపీపీ కందుల జాను, రీజనల్ కో ఆర్డినేటర్ మాశెట్టి బుజ్జి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి, నాయకులు ఆదినారాయణ, సైదులు, కిరణ్‌కుమార్, అజీజ్, హస్సన్, రసూల్, జయ, బడేసా, సుబ్బారావు, కిషోర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

వినాయకుడికి పూజలు చేసిన ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి : మండల వ్యాప్తంగా వినాయకుడి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఆదివారం జరిగింది. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా ఎదురుగా ఉన్న మన్సూర్‌పేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కాసును సన్మానించారు. నారాయణపురంలోని వైఎస్సార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, 20వ వార్డు ఇన్‌చార్జి ముశ్యం వెంకటేశ్వర్లు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఊరేగింపు

మాచర్ల: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో వినాయక విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు సంబరాలు సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగాయి. యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో గణపతికి జేజేలు పలుకుతూ నిమజ్జనానికి విగ్రహాలను తరలించారు. మాచర్ల పట్టణంలోని రామాటౌన్ వీధిలో 2 విగ్రహాలను, 13వ వార్డులోని 15వ బ్లాక్‌లో చీదెళ్ళ వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని జరిపారు. ఇదే వార్డులో ఏర్పాటు చేసిన 2 వినాయక విగ్రహాల వద్ద గల లడ్డూలకు వేలం పాట నిర్వహించగా రూ.31 వేలకు కైవసం చేసుకున్నారు. తీన్‌మార్, డీజేలతో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తరలించారు. పట్టణంలో ఎక్కడ చూసినా ఊరేగింపు సందడే కనిపించింది.



మన్సూర్‌షాపేటలో వినాయకుడి పూజల అనంతరం ఎమ్మెల్యే కాసుని సన్మానిస్తున్న దృశ్యం



వినాయకునికి జేజేలు పలుకుతున్న మహిళలు

వైభవంగా గణేష్ నిమజ్జన వేడుకలు

కారెంపూడి: స్థానిక అంకాలమ్మ గుడి సెంటర్‌లో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఏర్పాటు చేసిన మహా గణపతి నిమజ్జన వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ముందుగా గణపతి లడ్డూకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బొమ్మిన అల్లయ్య, హనుమయ్య తదితరులు వేలం పాట నిర్వహించారు. వేలంలో కోరె పాండు రూ.55 వేలకు లడ్డు దక్కించుకున్నాడు. అనంతరం మహిళలు మహా గణపతికి దివ్య హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం గణేష్ మహరాజ్ గ్రామోత్సవం గ్రామ ప్రధాన వీధుల్లో ప్రసాదాలు పంచుతూ వైభవంగా జరిగింది. ఇదిలా ఉంటే స్థానిక పాత ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనోత్సవం కూడా ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది.



పట్టణంలో వినాయకున్ని ఊరేగిస్తున్న దృశ్యం



ఘనంగా ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తిలో ఆనందోత్సాహాలతో..

వెల్దుర్తి: మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఆదివారం అధిక సంఖ్యలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గుండ్లపాడులో మల్లయ్యబావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఎంపీపీ చింతా శివరామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని కండ్లకుంట, వెల్దుర్తి, ఉప్పలపాడు, శిరిగిరిపాడు, మండాది గ్రామాలలో అధిక సంఖ్యలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. వివిధ గ్రామాలలో ప్రసాదాలు వితరణ చేశారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలు ఏర్పాటు చేసి గులాంలు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గ్రామాలకు సమీపంలోని కృష్ణానదికి తరలించి నిమజ్జనం నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎ.ఎమ్ మజ్జమ్మిల్



హాజరైన ముస్లిం సోదరులు

ఘనంగా గురజాలలో ధార్మిక సభ

గురజాల : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని బాని వ మొహతమిమ్ మద్రస మంబ ఉర్‌షాద్ వ ఖతీబ్ మస్జిద్ ఎ ఉమర్ షారూఖ్ బెంగుళూర్ పి.ఎమ్ మజ్జమ్మిల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం తమామ్ ముసల్మానానె , ముస్లిం యూత్ ఆధ్వర్యంలో మజ్లిసుల్ ఉలమా పల్నాడు ఇస్తిమా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం సోదరుడు ఖురాన్ మార్గాన్ని అనుసరించాలన్నారు. అంతిమ దైవ ప్రవక్త జీవిత చరిత్ర ప్రస్తుత సమాజంలో పిల్లలపై తల్లిదండ్రుల బాధ్యత గురించి వివరించారు. ఖురాన్ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నమూనయే సల్ఫ్ హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ బాసిత్ సాహెబ్ ఖాస్మీ, అమరావతి హజ్రత్ మౌలానా అబ్దుల్ ముస్త ఆన్ సాహెబ్ నద్వీ , చిలకలూరిపేటకు చెందిన ఖాదిముల్ ముసాజిద్ హజ్రత్ అఖ్ దస్ మౌలానా అబ్బాస్ ఖాన్ మత పెద్దలు, 9 మండలాల ఉలామాలు, మున్సిపల్ వైస్ చైర్మన్, బడే జానీ, నియోజకవర్గ ఖాజీ రిజ్వాన్, మసీదు కమిటీ అధ్యక్షులు నాగుల్ మీరా,పల్నాడు ప్రాంతం ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నిర్వహణ



మాచర్ల: దేశ ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విద్యా పరిషత్ ఆధ్వర్యంలో మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ ఎయిడ్స్ కంట్రోల్ అధికారి పద్మావతి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను, ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ ప్రెసిడెంట్ కొండ వీటి రామకోటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, దాసరయ్య, బొగ్గవరపు మస్తానరావు శిబిరంలో పాల్గొన్నారు. జిల్లా వైద్య అధికారి పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో 54 మంది రక్తదానం చేశారు. విద్యార్థులు, యువకులు, వైద్య సిబ్బంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు జయప్రకాష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న ఎస్ఐ సౌందరరాజన్

మాచర్ల: రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఆధార్ కార్డులేని వారికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ సేవాతి సమితి అధ్యక్షులు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. మాచర్ల పట్టణంలో చాలా మందికి ముఖ్యంగా పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోవుటంతో వారిని పాఠశాలల్లో చేర్చాలంటే ఇబ్బందికరంగా ఉంది. ఈ పరిస్థితి మాచర్ల పట్టణంలోని చాలా వార్డులలో ఉందని ముందుగా మాచర్ల పట్టణంలో ఆధార్‌కార్డు లేని వారిని గుర్తించి తరువాత ఆధార్ కార్డు నమోదుకు అధికారుల అనుమతి కొరకు ప్రయత్నిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ ఐ.సౌందరరాజన్ పాల్గొని మాట్లాడుతూ నిరక్షరాస్యులుగా ఉన్న పిల్లలను గుర్తించి వారి జీవితాలలో వెలుగులు నింపే ఉద్దేశంతో వారికి ఆధార్ కార్డుల నమోదు బాధ్యతను మెట్టు గోవిందరెడ్డి చేపట్టడం శుభపరిణామమని కొనియాడారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సంగీతం మాస్టర్ షేక్ చిన్నలాలు సాహెబ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎన్‌జీవో నాయకులు మెట్టు రఘురామిరెడ్డి, సేవా సమితి కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వర రెడ్డి, విశ్రాంత హెడ్‌ఎం ముత్యాల పాపిరెడ్డి, స్వామి వివేకానంద స్టూడెంట్స్ హోం చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ భవిష్యత్తు



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వైఎస్ చౌదరి ఎన్ఎస్ఎస్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని చెప్పారు. విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక స్ఫూర్తి కూడా అవసరం అన్నారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా, వారిలో వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా ఎన్ఎస్ఎస్ మార్గంగా నిలుస్తోందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ నాట్ యూ బట్ యూ నినాదం ప్రజాస్వామ్య జీవన స్ఫూర్తిని సూచిస్తుందన్నారు. దీనికి ముందు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి గూగుల్ మీట్ ద్వారా పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శుభాకాంక్షలు తెలిపి ఏపీఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సేవలు ఎంతో ప్రఖ్యాతి పొందాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే మహమ్మద్‌బాష, అధ్యాపకులు సతీష్‌బాబు, సుదర్శన్, రాణి, నీరజ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న సురక్ష కార్యక్రమం



కారెంపూడిలో వ్యక్తికి బీపీ పరీక్ష చేస్తున్న ఏఎన్ఎం ఈశ్వరి, సూపర్‌వైజర్ మల్లయ్య



పేటసన్నెగండ్ల గ్రామంలో వైద్య పరీక్ష చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ రాము

కారెంపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కారెంపూడి, గాదెవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఆదివారం గ్రామాలలో ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. ఎవరికైనా అనారోగ్య సమస్య ఉన్నా, బీపీ, షుగర్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినా వారికి జగనన్న సురక్ష టోకెన్లు పంపిణీ చేశారు. టోకెన్లు పొందిన వారికి త్వరలో ఆయా గ్రామాలలో నిర్వహించనున్న జగనన్న సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్ల బృందం వైద్య సేవలు అందించనున్నారు. కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలోని కారెంపూడి, ఒప్పిచర్ల, నరమాలపాడు గ్రామాలలో అదే విధంగా గాదెవారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో పేటసన్నెగండ్ల, వేపకంపల్లి, పెదకొదమగుండ్ల గ్రామాలలో వైద్య బృందాలు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. డాక్టర్ బి.దుర్గారావు, డాక్టర్ ఎం.రమ్యల పర్యవేక్షణలో సూపర్‌వైజర్లు మల్లయ్య, వెంకటమణి, మస్తాన్‌వలి, ఆరగ్యో సహాయకులు లాల్, రాజు, అనూషా, ఈశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, అపర్ణ, ఆశ కార్యకర్తలు నాగజ్యోతి, అపర్ణలు కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అలాగే గాదెవారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం వెంకటరత్నం, పీహెచ్ఎన్ విజయలక్ష్మి, ఆశ వర్కర్లు శివ పార్వతి, మల్లేశ్వరి, సుజాతలు ఒక బృందంగా, ఎంఎల్‌హెచ్‌పీ రాము, ఏఎన్ఎం సునీత, ఆశ వర్కర్లు లాలారాణి, కోటేశ్వరమ్మ, పీహెచ్ఎన్ విజయలక్ష్మిలు మరో బృందంగా, హెచ్ఏ రామ్‌మోహన్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, ఏఎన్ఎం సునీత మూడవ బృందంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30వ తేదీన నరమాలపాడులో వచ్చే నెల 5వ తేదీ కారెంపూడిలో, 9వ తేదీ ఒప్పిచర్ల గ్రామాలలో టోకెన్లు పొందిన వారికి ఉచిత మెగా వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలందించనున్నారని సూపర్‌వైజర్ మల్లయ్య ఈ సందర్భంగా తెలిపారు.

ఉపాధ్యాయులకు అండగా వైఎస్సార్ సీపీ

అభివృద్ధిలో ఉపాధ్యాయులు కూడా భాగస్వాములు కావాలి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నర్సరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు



ఎస్టీయూ బ్యాగ్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల: ఉపాధ్యాయులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని ఎస్టీయూ నూతన కార్యాలయ భవనాన్ని ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎల్‌వీ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కూడా నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులను మంచి బాటలో నడిపించాలన్నారు. ఉపాధ్యయుల సమస్యలను పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్తామని తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. గతంలో గురజాల నియోజకవర్గంలో ఎక్కడా సరైనా హాస్పిటల్ లేదని, కానీ పిడుగురాళ్ల పట్టణానికి సమీపంలో ప్రభుత్వ వైద్యశాల, మెడికల్ కళాశాల రాబోతుందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కృష్ణాజలాలు త్వరలోనే అందించబోతున్నామన్నారు. ఎస్టీయూ నాయకులు తనను సంప్రదించటంతో వెంటనే స్థలం కేటాయించేందుకు కృషి చేశామని తెలియజేశారు. కానీ దాతల సహకారంతో వెంటనే భవన నిర్మాణం పూర్తి కావటం ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. పిడుగురాళ్ల పట్టణంలో ఒక్క ఇంజనీరింగ్ కాలేజీ కూడా లేదని త్వరలోనే పట్టణంలో డిగ్రీ కాలేజీ, జంగమహేశ్వరపురంలో అగ్రికల్చర్ కాలేజీ, దాచేపల్లి, పిడుగురాళ్ల మధ్య ఇంజనీరింగ్ కళాశాల, మాచవరం మండలంలో జూనియర్ కాలేజీలను తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఉపాధ్యాయులు కూడా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి ఎస్టీయూ కార్యాలయంలో ఒక గదిని ప్రారంభించారు. అనంతరం ఎస్టీయూ బ్యాగ్‌లను ఎంపీ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన, మున్సిపల్ చైర్మన కొత్త వెంకట సుబ్బారావు, ఎంపీపీ అల్లు సత్యవతి, కౌన్సిలర్ అన్నెం పద్మావతి, అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిండు మనసుతో మరియతల్లిని ప్రార్థించండి

సాగరమాత ఆలయ విచారణ గురువులు



తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: దేవుని కృప వలన లోక రక్షకుడైన యేసుక్రీస్తుకు జన్మనిచ్చిన మరియతల్లి పరమ పవిత్రురాలిగా కీర్తి పొందారని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. భక్తులు నిండు మనసుతో మరియతల్లిని ప్రార్థిస్తే ఆ తల్లి దీవెనలు అందిస్తుందన్నారు. అనంతరం సాగర్‌మాత దేవాలయం చుట్టూ భక్తులతో కలిసి తేరు ప్రదక్షిణలు చేసి ఆశీర్వాదం అందజేశారు. దీనికి ముందు భక్తులు సాగర్‌మాత దేవాలయంలో కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి, తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

శాంతి స్థాపనకు సహకరించండి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ సురేంద్రబాబు

దాచేపల్లి : శాంతిభద్రతలను పరిరక్షించటంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ సురేంద్రబాబు అన్నారు. గత రెండు రోజుల క్రితం దాచేపల్లిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ..పండుగలు, ఊరేగింపులు చేసుకునే సమయాల్లో కులాలు, మతాల మధ్య కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ కలసిమెలసి ఐకమత్యంతో ఉండాలని, శాంతిస్థాపన కోసం ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, సంధ్యారాణి, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కొప్పుల రవి, సయ్యద్ మౌలాలీ, కొలా శ్రీనివాసరెడ్డి, అంబటి మల్లి, మందపాటి దుర్గారావు పాల్గొన్నారు.